# 12 న జాతీయ లోక్ అదాలత్

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వెంకట జ్యోతిర్మయి

(పెన్‌పవర్ స్టాఫ్ రిపోర్టర్, ప్రకాశం, ఫిబ్రవరి 9)

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం దేశవ్యాప్తంగా మార్చి 12వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల ప్రాంగణాలలో జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వెంకట జ్యోతిర్మయి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడ దగిన అన్ని క్రిమినల్ కేసులు, అన్ని సివిల్ తగాదాలు, వివాహ సంబంధ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన బీమా పరిహారం చెల్లింపు కేసులలో కక్షిదారులు ఇరు వర్గాల వారు వచ్చి ఎటువంటి ఖర్చు లేకుండా వారికి సంబంధించిన న్యాయవాదుల సమక్షంలో కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా చెల్లని చెక్కు కేసులలో ఇరు వర్గాలను పిలిపించి సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా వివాహ సంబంధ వ్యాజ్యాలలో దంపతులు ఇరువురికీ న్యాయమూర్తుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇప్పించి వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు వివిధ ఆర్థిక సంస్థల నుండి, బ్యాంకుల నుండి పొందిన రుణాలకు సంబంధించినా కేసుల పరిష్కారానికి ఆర్థిక సంస్థలతో, బ్యాంకు వాళ్లతో మాట్లాడి కేసులు పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిధంగా న్యాయస్థానాల్లో కుటుంబ సభ్యులకు సంబంధించి పెండింగ్లో ఉన్న పంపిణీ కేసులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పరిష్కరించటానికి కృషి చేస్తామని తెలిపారు. మోటారు వాహన ప్రమాద బీమా పరిహారం చెల్లింపు కేసుల్లో ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో, వారి న్యాయవాదులతో విస్తృతంగా సమావేశం నిర్వహిస్తున్నామని వారితో మాట్లాడి కేసులను పరిష్కరిస్తామని ఈ అవకాశాన్ని సంబంధిత కక్షిదారులు అందరూ వారి న్యాయవాదుల సహకారంతో పరిష్కరించుకోవచ్చని అన్నారు.